మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# స్పోర్ట్స్ హబ్‌గా మారుద్దాం..

## క్రీడాభివృద్ధికి కృషి :ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.మహబూబ్‌నగర్‌లోని స్టేడియం మైదానంలో జరిగిన 11వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.అంతకుముందు ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్ పోటీలను విజయవంతంగా నిర్వహించినందుకు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా బాధ్యులను ప్రత్యేకంగా అభినందించారు. మహబూబ్‌నగర్‌ను స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.జిల్లాలో ఉన్న క్రీడా ప్రేమికులు ఏ క్రీడలను ఎంచుకున్న వారిని ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పి వెంకటేష్,ముడాచైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, రాష్ట్ర ఫుట్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.పి.ఫల్గున, మహబూబ్ నగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి




చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

# 270 మందికి రూ.1.70కోట్ల చెక్కులు

## పేదల వైద్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** ప్రజా ప్రభుత్వంలో వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని లబ్దిదారులకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో గత మూడు నేలల్లోనే 270 మందికి కోటి70లక్షల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదలఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు సిఎం రిలీఫ్ ఫండ్ కోసం సరియైన పత్రాలను క్యాంపు కార్యాలయంలో ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, మైనారిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఫయాజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అజ్మత్ అలీ, ఓబిసి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండి మల్లేష్ యాదవ్, సోషల్ మీడియా ఇంచార్జ్ ఏర్పుల నాగరాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, రాషెద్ ఖాన్, ఉమర్, మునీర్, శంకర్, నాయకులు లీడర్ రఘు, అనుప ఆంజనేయులు, సిరిగిరి మురళీధర్ పాల్గొన్నారు.

## అభివృద్ధిలో కొండారెడ్డిపల్లి

# దేశానికే ఆదర్శం

- అట్టహాసంగా ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు
- రూ.134 కోట్లకు పైగా వ్యయంతో కొండారెడ్డిపల్లిలో అభివృద్ధి పనులు
- సౌర విద్యుత్ గ్రామంగా ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లి
- దేశంలో రెండో గ్రామం, దక్షిణ భారత దేశంలో మొదటి గ్రామం
- ప్రతి ఇంటికి ఉచిత సోలార్ ప్లాంటు
- రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న దృశ్యం



ప్రారంభోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభంతో కొండారెడ్డిపల్లి గ్రామం అభివృద్ధి దిశగా మరింత ముందడుగు వేస్తుందని రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో రూ.134 కోట్ల ఖర్చుతో కూడిన పలు అభివృద్ధి పనులను ప్రారంభోత్సవాలు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా ముందుకెళ్తొందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డా.వంశీకృష్ణ, డా.కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, వివిధ శాఖల రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, కొండారెడ్డిపల్లి అభివృద్ధి కమిటీ చైర్మన్, కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌ల కలిసి రాష్ట్ర మంత్రులు రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ జూపల్లి కృష్ణారావు వాకాటి శ్రీహరిలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలు మాట్లాడుతూ తెలంగాణ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నట్లు, కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర మంత్రులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఉన్న మా ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య సేవలు, యువతకు నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆ దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామం దేశంలోనే ఓ ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుంది. ఇటీవల గ్రామంలోని 516 గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు అన్నింటికీ సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా గ్రామం విద్యుత్ స్వావలంబన సాధించిందని, కొండారెడ్డిపల్లి గ్రామ సౌర విద్యుత్ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.10.53కోట్లు, అందులో రూ.7.96 కోట్లతో సౌర విద్యుత్ పరికరాలు ఏర్పాటు చేశారన్నారు. రూ.2.59 కోట్లను మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించారు. ప్రతి ఇంటి నుండి నెలకు 360 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ప్రతి రోజుకు సగటుగా 120 యూనిట్లు వస్తాయి. ఇంటి వినియోగం తర్వాత మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. యూనిట్‌కు రూ.5.25 చెల్లించేందుకు విద్యుత్ పంపిణీ సంస్థ లబ్ధిదారులతో ఒప్పందం కుదుర్చుకుంది. సెప్టెంబర్ నెలలో మొత్తం గ్రామం నుండి సుమారు ఒక లక్ష యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపారు. దీంతో ఒక్క నెలలోనే గ్రామస్తులకు సుమారు రూ.5 లక్షల ఆదాయం సమకూరిందని మంత్రులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ఏర్పాట్ల తో పాటు, విద్యార్థులకు నైపుణ్యమైన వైద్య విద్యను అందించడంతోపాటు ప్రతి జిల్లాలో డయాబెటిస్ నుండి క్యాన్సర్ వరకు చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధికంగా డయాలసిస్ కేంద్రాలు ఏర్పాట్లు చేసిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన గంట (గోల్డెన్ అవర్)లోపు వైద్యం అందించే విధంగా తెలంగాణ వ్యాప్తంగా ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తామని మంత్రులు పేర్కొన్నారు. క్యాన్సర్ నివారణకు రాష్ట్ర ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, క్యాన్సర్ నివారణకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రులు తెలిపారు. తెలంగాణలో నైపుణ్యమైన యువతను తీర్చిదిద్దాలని ఉద్దేశంతో 65 ఏటీసీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని సమూలంగా మార్చి ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యం కలిగిన శిక్షణ అందించాలన్న లక్ష్యంతో గత ఏడాది ఇదే ప్రాంగణంలో ఏటీసీలకు పునాదులు వేసుకున్నామని తెలిపారు. మొత్తం 134 కోట్ల రూపాయల వ్యయంతో 18 రకాల అభివృద్ధి పనులు –మిగతా4లో..

## దమ్ముంటే ఆల్మట్టి డ్యాం

# ఎత్తు పెంచకుండా ఆపండి

- తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడేది కేసీఆర్
- మంత్రులకు సోయిలేకున్న అచ్చంపేట బిడ్డలకు తెలివి ఉంది
- అచ్చంపేట జన గర్జన సభలో మాజీ మంత్రి కేటీఆర్



బహిరంగ సభలో మాట్లాడుతున్న కేటీఆర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** కర్ణాటక ప్రభుత్వం 70వేల కోట్ల రూపాయలు వెచ్చించి ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచేందుకు కుట్రలు పన్నుతుందని, ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణకు కృష్ణా నీళ్లు రాకుండా అడ్డుపడతారని, దీంతో తెలంగాణ ఎడారిగా మారే అవకాశం ఉందని రాష్ట్ర మంత్రులకు, ముఖ్యమంత్రికి దమ్ముంటే ఆల్మట్టి ఎత్తు పెంచకుండా ఆపాలని మాజీమంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలో అచ్చంపేట పట్టణంలో నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే అచ్చంపేట బిఆర్ఎస్ ఇంచార్జ్ మర్రి జనార్దన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జనగర్జన సభకు మాజీ మంత్రి బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యేలు టిఆర్ఎస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచితే –మిగతా4లో..

# కృష్ణమ్మ ఉగ్రరూపం

- శ్రీశైలం డ్యాంకు 5లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 10గేట్లు 23అడుగులు ఎత్తి సాగర్‌కు నీటివిడుదల
- 882.70 అడుగులకు చేరుకున్న నీటిమట్టం
- జూరాలకు భారీ వరద.. 39గేట్లు ఎత్తివేత



జూరాల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద



శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మకు వరద ఉధృతి పెరుగుతున్నది. నది ఉగ్రరూపం దాల్చుతున్నది. దీంతో కృష్ణానదిపై ఉన్నప ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం డ్యాం నిండుకుండలా మారింది. ఆదివారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు డ్యాం నీటిమట్టం 885అడు గులకు గాను 882.70అడుగులకు చేరింది.డ్యాం సామర్థ్యం 215.8070టీఎంసీలకు 202.9673 టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల స్పిల్‌వే ద్వారా 5,20,552క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 79268క్యూసెక్కులు,హంద్రీ నుంచి 27000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ,కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 64,759క్యూసెక్కులు విడుదలచేశారు. డ్యాం 10గేట్లు 23అడుగులు ఎత్తి 5,18,650 క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి మొత్తంగా 5,93,680క్యూసెక్కుల వరద నాగార్జున సాగర్‌కు విడుదల అవుతున్నది.జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల గేట్లు ఎత్తివేశారు. జూరాల ప్రాజెక్టుకు 5,05,000 ఇన్‌ఫ్లో నమోదు కాగా, 39గేట్లు ఎత్తి దిగువకు 5,17,473క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.జూరాల పూర్తిసామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 2.755టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. అవుట్‌ఫ్లో 5,17,495క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

# బతుకమ్మ సంబరాలు

## పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో మెప్మా, డిపిఆర్‌ఓ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్, అగ్నిమాపకశాఖ,ఎస్‌సి కార్పొరేషన్‌శాఖల నుండి పెద్ద ఎత్తున మహిళలు కుటుంబ సభ్యులతో హాజరై బతుకమ్మ పాటలకు లయబద్ధంగా బతుకమ్మలు ఆడారు. పెద్ద ఎత్తున హాజరైన మహిళలకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌ఓ శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఇస్రా నాయక్ తదితరులు పాల్గొన్నారు.




కలెక్టరేట్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మెప్మా, డిపిఆర్‌ఓ, ఎస్‌సి కార్పొరేషన్ శాఖల కుటుంబ సభ్యులు

# అన్న డిఎస్పి.. చెల్లి మున్సిపల్ కమిషనర్

## ఒకే ఇంట్లో 2 గ్రూప్ వన్ ఉద్యోగాలు సాధించిన గిరిజన కుసుమాలు

**నవాబుపేట, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** అన్న డి.ఎస్.పి.,చెల్లి మున్సిపల్ కమిషనర్. ఒకే ఇంట్లో రెండు గ్రూప్1 ఉద్యోగాలు సాధించిన సాధారణ రైతు బిడ్డలు. మండల పరిధిలోని కొల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సత్రోనిపల్లి తండాకు చెందిన విస్లావత్ తారాబాయి విస్లావత్ చందర్ నాయక్‌ల కుమారుడు విస్లావత్ అరుణ్ కుమార్ కు డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్‌గా, విస్లావత్ స్వర్ణలతకు మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. నియామక పత్రాలను శనివారం రోజు హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదిక లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తీసుకున్నారు. తల్లి విస్లావత్ తారాబాయి అంగన్ వాడి టీచరుగా,తండ్రి విస్లావత్ చందర్ నాయక్ సామాన్య రైతు వీరికి నలుగురు పిల్లలు ఒక బాబు,ముగ్గురు కుమార్తెలు ముగ్గురు కుమార్తెల్లో పెద్ద కుమార్తె స్కూల్ అసిస్టెంట్ గా,రెండవ కుమార్తె స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఒకే ఇంట్లో రెండు గ్రూప్1 ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు, మండల తండా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించిన కొడుకు, కూతురుతో తల్లిదండ్రులు

# తండ్రి కంట్రోలర్... కూతురు డిప్యూటీ కలెక్టర్

**నారాయణపేటటౌన్,సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** నారాయణపేటపట్టణానికి చెందిన వీణ గ్రూప్1లో ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్ అయ్యారు.తండ్రి శ్రీనివాస్ ఆర్టీసి కంట్రోలర్‌గా పనిచేస్తుండగా కూతురు వీణ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికై రంగారెడ్డి శిక్షణకలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. రంగారెడ్డిజిల్లా కలెక్టరేట్‌లో ఏడాదిపాటు శిక్షణ పొందనున్నారు.అనంతరం రాష్ట్రంలో ఏదేని జిల్లాడిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ పొందుతారు. కాగా తమ కూతురు డిప్యూటీ కలెక్టర్ కావడం పట్ల ఆమె తల్లిదండ్రులు ఆర్టీసి కంట్రోలర్ శ్రీనివాస్, తల్లి వసుంధర ఆనందం వ్యక్తం చేశారు. కాగా వీణ మాట్లాడుతూ తను డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక కావడంలో తన తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందని అన్నారు.పేద ప్రజల కష్టాలు తీర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే తన ఆశయమని అన్నారు.



డిప్యూటీ కలెక్టర్‌గా ఎన్నికైన వీణతో తల్లి దండ్రులు



దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఐదో శక్తిపీఠం జోగుళాంబ ఆలయంలో అమ్మవారు భక్తులకు కాళరాత్రి దేవీగా దర్శమిచ్చారు.
( అలంపూర్ , సెప్టెంబరు 28, ప్రభాతవార్త )



పట్టు వస్త్రాలను అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్

## అమ్మవారికి పట్టు వస్త్రాలను అందజేసిన రాజ్యసభ సభ్యుడు

**అలంపూర్ సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** అష్టదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి అమ్మవారి దేవీ నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. జోగులాంబ అమ్మవారికి బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు శనివారం రోజు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ కుటుంబ సమేతంగా అమ్మవారికి స్వామివారికి పట్టువస్త్రాలన అందజేశారు. అంతకంటే ముందుగా వీరికి ఆలయ ఈ ఓ.దీప్తి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ముందుగా స్వామివారాలయంలో అభిషేకాలు అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయాల విశిష్టతల గురించి ఆలయ అర్చకులు వారికి వివరించారు. వీరి వెంట ఆలయ పాలకమండలి సభ్యులు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాకంబరి దేవి అవతారంలో అమ్మవారి దర్శనం

**వెల్దండ, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బుధవార్‌పేట ఆంజనేయస్వామి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 7వ రోజు శాకంబరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు ప్రత్యేక దర్శనం ఇచ్చారు.ఈ సందర్భంగా ఉప్పు బాలస్వామి, ప్రేమలత దంపతులు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన, పారాయణ పఠనం చేసి భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.ఈ సందర్భంగా పూజలునిర్వహించిన దంపతులను నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి అమ్మవారి ఫోటోను బహుకరించి అమ్మవారి దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రచార కార్యదర్శి మిర్యాల రాజయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షులు బికుమాండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పాలాది సంతు,పూరి వజ్రలింగం, జూలూరిబాలస్వామి, జూలూరుఈశ్వరయ్య, జూలూరి కుమార స్వామి, పూరివజ్రలింగం,ఉప్పుశ్రీనివాస్, నవీన్‌తోపాటు ఆర్యవైశ్య మహిళలు భక్తులు పాల్గొన్నారు.

## కాత్యాయని దేవిగా వాసవీ మాత దర్శనం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న 55వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరియు కమిటీతో పాటు అలంకరణ దారులు శ్రీ కాత్యాయని దేవిగా వాసవీ మాతను అలంకరించారు. ఈ సందర్భంగా వాసవి మాతకు గులాబీ చీరతో పాటు జీరా రైస్ నైవేద్యాన్ని అందించారు. ఆలయ ఉత్సవ విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సామూహిక పూజా కార్యక్రమంలో విశేషంగా దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరంఅతిధులుగా హాజరైన సిఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ గోవర్ధన్‌తో పాటు పలువురుని సన్మానించారు. అనంతరం మహానీరాజనం తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణను చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ వాసవి భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు.సాయంకాలంనిర్వహించిన శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా కన్నుల పండుగ కొనసాగింది.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు శివ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు మరియు పట్టణ ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**దామరగిద్ద, సెప్టెంబరు28 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో దేవి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. మండల కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ గజలేశ్వరి మాత అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అమ్మవారికి పూజలు చేశారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వెంకటేశ్వర కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత నిర్వాహకులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గజలప్ప, శ్రీనివాస్, జికే వెంకటప్ప, లక్ష్మప్ప, రాజు, గణేష్, పాల్గొన్నారు.

## రాముని రూపంలో అమ్మవారి దర్శనం

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రం దూల్ పేట అంబా భవానీ మందిరంలో రాముని రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

## శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకరణలో వాసవీ మాత

**పెబ్బేరు, సెప్టెంబరు28 ప్రభాతవార్త:** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెబ్బేరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఏడో రోజు ఆదివారం శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఉత్సవ విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య దంపతులు పూజలో కూర్చుకున్నారు. మహిళలు, చిన్నారులు అమ్మవారి వారి వద్ద కుంకుమార్చన, తదితర పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు మహా మంగళహారతి, నీరాజనం ఇచ్చి భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. దాతల సహకారంతో ఆర్యవైశ్య సంఘం సభ్యులు అన్నప్రసాదం, అల్పాహారం వితరణ చేశారు.

## మహాచండి దేవిగా దుర్గమాత

**బిజినేపల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు మహా చండి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణ మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. చండీదేవిని దయగల రూపంలో ఉన్నప్పుడు ఉమా, గౌరీ, పార్వతి, హైమవతి, శతాక్షి , శాకంభరీ దేవి, జగన్మాత, భవాని అని పిలుస్తారు. అలాగే భయంకరమైన రూపంలో ఉన్నప్పుడు ఆమెను దుర్గ, కాళి, శ్యామ, చండీ, చండిక, భైరవి పేర్లతో పిలుస్తారు. ఈ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించు కుంటే మనసులో ఉన్న కోర్కె నెరవేరుతుందని భక్తుల విశ్వాసం.

## లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నదీ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**కృష్ణ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** గతవారం నుంచి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణ, భీమా నదులు నిండు కుండలా పరవళ్ళు త్రొక్కుతూ పొంగి పొర్లుతున్నాయి. దీంతో నదీ ప్రవాహాన్ని పరిశీలించిన ఎస్సై నవీద్ లోతట్టు ప్రాంత ప్రజలు ముఖ్యంగా గుడేబల్లూరులోని వాసునగర్ కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నది వేగంగా ప్రవహిస్తుండడంతో ప్రవాహ తాకిడికి కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున ఎలాంటి పనులున్నా నదీ తీరానికి వెళ్ళరాదన్నారు. నదిని పరిశీలించిన వారిలో ఎస్సై నవీద్, తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్ గౌడ్, పలు అధికారులతో పాటు స్థానికులు ఉన్నారు.

## తెగిన కేఎల్ఐ... వృథాగా పారుతున సాగునీరు



**వెల్దండ, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రం సమీపంలోని లచ్చపురం దగ్గర ఎగువ నుండి భారీ ఎత్తున సాగునీరు దిగువకు రావడంతో ఆదివారం తెల్లవారు జామున కేఎల్ఐ సాగునీరు కాల్వకు మరోసారి గండిపడి సాగునీరు వృథాగా పారడంతో పాటు పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గత నెల రోజుల కిందట మరొక సారి గండిపడటంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించి అధికారులను అప్రమత్తం చేసి కాల్వ గండిని పూడ్చారు. కేఎల్ఐ కాల్వకు మరోసారి గండి పడడంతో రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్

**ఆత్మకూర్ సెప్టెంబర్ 28,ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలానికి చెందిన బిజెపి కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసం అని అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేసే విధంగా చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం రోజు ఆయన మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ శివకుమార్తో కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల నాలుగవ తేదీన హిందూ వాహిని కి సంబంధించిన కార్యకర్తలు బిజెపి నాయకులు శాంతియుతంగా పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా ఈ కార్యక్రమానికి అన్ని పార్టీలకు చెందిన నాయకులు మద్దతు పలికినప్పటికీ పోలీసులు మాత్రం కేవలం బిజెపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించడం సమంజసం కాదన్నారు. ఈనెల ఐదవ తేదీన గణేష్ నిమజ్జనం పురస్కరించుకొని హిందూ వాహిని సంఘ సభ్యులు కాషాయ జెండాలు ఎగురవేయగా అదే రోజు రాత్రికి రాత్రి మరో వర్గానికి చెందిన యువకులు ఆకుపచ్చ జండాలు కట్టడం ఎంతవరకు సమంజసమని ఎవరి అండతో వారు ఈ పనులు చేస్తున్నారో పోలీసులు తెలుసుకోలేరా అంటూఅయిన తీవ్రస్థాయిలో ప్రశ్నించారు.మక్తల్ నియోజకవర్గం లో ప్రశాంత వాతావరణంలో కలిసి మెలిసి జీవిస్తున్న తరుణంలో అనవసరంగా పోలీసులు బిజెపి కార్యకర్తలపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి మతపరమైన ఘర్షణలు చోటుచేసుకునే విధంగా అవకాశం కల్పించడం సరికాదన్నారు.ఇప్పటికైనా నిజానిజాలు పరిశీలించి అక్రమంగా బనయించిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని లేనిపక్షంలో రాష్ట్ర బిజెపి పార్టీ తగిన విధంగా స్పందిస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్ గౌడ్,అమరచింత మరియు ఆత్మకూరు మండలాలబిజెపి అధ్యక్షులు అశోక్‌భూపాల్ యాదవ్ మంగలావణ్య, బిజెపి నాయకులు మండల సూరి, ఆంజనేయులు ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు అశోక్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నమ్మిరాజు, బాలకృష్ణ,మండల నాయకులు ఎల్లన్న ఎద్దుల రాజు తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దమ్ముంటే ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచకుండా ఆపండి

**మొదటి పేజీ తరువాయి భాగం..**



ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్, సభలో చిన్నారి

తెలంగాణ రైతంగానికి సాగునీరు అందకపోవడంతో నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిలో నెలకొంటాయని రాష్ట్ర ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీతో కర్ణాటక ముఖ్యమంత్రిని పిలిపించి తెలంగాణకు సాగునీటిలో అన్యాయం జరగకుండా మాట్లాడాల్సింది పోయిపూటకో మాట మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టులను 10 శాతం కూడా పూర్తి చేయకుండా అచ్చంపేట లిఫ్టింగ్ ఎలా ప్రారంభించారని ఆయన ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గారంటీల పథకాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను ముమ్మాటికి మోసం చేస్తూ కాలయాపన చేస్తున్నారే తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం మాత్రం పనిచేయడం లేదని ఆయన ఆయన దుయ్యబట్టారు.ఆంధ్ర వలస పాలకుల నుండి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు కేసిఆర్ కొట్లాడి సాధించిన తెలంగాణ రాష్ట్రంలోరాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కొట్లాడేది ఒక్క కేసీఆర్ అని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ అందించకపోవడంతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులుచదువు కొనసాగించలేక అవస్థలు పడుతున్న విషయం ముఖ్యమంత్రికి అర్థం కావడం లేదా అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనసాగుతున్న మంత్రులకు సోయి లేకపోయినా కూడా అచ్చంపేట బిడ్డలకు తెలివుందనిప నాయకుడు మాకు అవసరం లేదని కేసీఆర్ తోనే కలిసి ఉండి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తామని అచ్చంపేట గడ్డపై నిర్వహించిన జనగర్జన సభకు వేలాదిగా తరలివచ్చిన అచ్చంపేట బీఆర్ఎస్ బిడ్డలను చూస్తుంటే రానున్నది టిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఇక్కడి నుండే తేటతెల్లమవుతుందని ఆయన పేర్కొన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ బిజెపిలకు తగిన బుద్ధి చెప్పాలని ఆయన బిఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీలో ఏదైనా పథకం అమలు చేయాలంటేరాహుల్‌గాంధీ అనుమతి లేకుండా చేయలేరని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి జరగాలన్న రాహుల్ గాంధీ అనుమతిస్తే తప్ప ఈ రాష్ట్రం అభివృద్ధి జరగదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే రూ.2లక్షల ఉద్యోగాలను అంది స్తామని గాలి మాటలు చెప్పి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరన్న గడిచినప్పటికీ ఉద్యోగాల నోటిఫికేషన్ వేయక పోవడం సిగ్గు చేటుకరమని ఆయన విమర్శించారు.కార్యక్రమంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్,ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, రజిని సాయిచంద్, నాయకులు పోకల మనోహర్,అభిలాష్‌రావు, శ్రీకాంత్‌భీమా, నరసింహ గౌడ్, రమేష్ రావు, గణేష్ రావు, ఎల్లాగౌడ్, ప్రవీణ్‌రెడ్డి, నరేందర్‌రావు, శ్రీపతిరావు, కర్ణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కడుపు నొప్పితో బాలిక మృతి



మృతి చెందిన బాలిక

**పెబ్బేరు, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** కడుపునొప్పి రావడంతో ఐదు సంవత్సరాల బాలిక మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం విపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన శిరీష రాముడు దంపతుల కూతురు రమ్య ఐదు సంవత్సరాలు ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటలకు కడుపునొప్పితో బాధపడడంతో కుటుంబ సభ్యులు చిన్నారిని చికిత్స నిమిత్తం పెబ్బేరులోని జనని హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. తమ కూతురికి వైద్యం అందించాలని తెలియజేశారు. వెంటనే డా. జయచంద్ర రెడ్డి అమ్మాయిని పరీక్షించి ఇంజక్షన్ ఇచ్చారు. తర్వాత బాలికకు కడుపునొప్పి ఎక్కువ కావడంతో స్పందించిన డాక్టర్ ఎక్స్‌రే తీసి చూడగా పేగు మడత పడిందని దాని నుంచి ఊపిరి తిత్తులకు వెళ్లడం వల్ల అమ్మాయికి ఇబ్బంది కలిగిందని వెంటనే మహబూబ్‌నగర్ హాస్పిటల్‌కు తరలించాలని అమ్మాయి తల్లిదండ్రులకు సూచించారు. తల్లిదండ్రులు అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్‌కు తరలించగా హాస్పిటల్‌కు దగ్గర ఉన్న క్రమంలో అమ్మాయి మృతి చెందిందని శ్వాస ఆడడం లేదని తెలిసింది. కుటుంబ సభ్యులు అందరు కలిసి హాస్పిటల్ ఎదురుగా మా అమ్మాయికి నష్టపరిహారం చెల్లించాలని డాక్టరును డిమాండ్ చేశారు. రెండు లక్షలు చెల్లించాలని డిమాండ్ చేయగా డాక్టర్‌తో మాట్లాడి మధ్యవర్తులు ఒప్పించినట్టు సమాచారం.

**డా. జయచంద్ర రెడ్డి వివరణ..**

పెబ్బేర్ పట్టణానికి చెందిన జనని హాస్పిటల్ డా. జై చంద్ర రెడ్డి అమ్మాయి చనిపోయిన విషయంపై వార్త ప్రతినిధి నేరుగా సంప్రదించగా అమ్మాయిని ఉదయం 5 గంటలకు కడుపు నొప్పి ఉందని తీసుకొచ్చారు. వెంటనే నేను పరీక్షి ంచగా పేగు మడత పడి శ్వాస నాళంలో వేళ్లి ఆయాసం రావడం వలన అమ్మాయి చాలా ఇబ్బంది పడిందని దానికి నేను వాంతింగ్ కు, కడుపునొప్పి, యాంటీబయాటిక్ ,సెలైన్ బాటిల్ పెట్టి ఆక్సిజన్ ట్రీట్మెంట్ చేశానని అమ్మాయి హాస్పిటల్ లో 45 నిమిషాలు మాత్రమే ఉందని నొప్పి ఎక్కువ కావడంతో మహబూబ్‌నగర్ కు తరలించమని తెలియజేశానని అమ్మాయికి నేను సరిపడా ట్రీట్మెంట్ అందించానని నేను చేసిన ట్రీట్మెంట్ అమ్మాయి ఇబ్బంది పడడానికి సంబంధం లేదని తెలియజేశారు. అమ్మాయి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి నేను చేసిన ట్రీట్మెంట్‌కు తప్పు ఏమన్నా ఉంటే నాపై చట్టపరంగా నాపై చర్యలు తీసుకోవాలని దానికి నేను పైసలు కట్టాల్సిన అవసరం లేదని డా. జయచంద్ర రెడ్డి స్వయంగా తెలియజేశారు.

# అభివృద్ధిలో కొండారెడ్డిపల్లి దేశానికే ఆదర్శం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

చేపట్టబడ్డాయి. వీటిలో భాగంగా రూ.6 కోట్లతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు కొత్త సముదాయ భవనాల నిర్మాణాలు, రూ.30 లక్షల రూపాయలతో పాల సేకరణ కేంద్రం, రూ.30 లక్షల రూపాయలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ (మాల), 30 వేల లీటర్ల సామర్థ్యంతో ఆధునిక పరికరాలతో పాలశీతలీకరణ కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. రూ.20 లక్షలతో 10 సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు, రూ.1 కోటి 30 లక్షలతో సోలార్ వీధి దీపాల ఏర్పాట్లకు శంకుస్థాపనలు చేశారు. రూ.10లక్షలతో పశువైద్యశాల ప్రహరిగోడ, మరియు భవన బ్యాలెన్స్ పనులు, రూ.85 లక్షలతో మిషన్ భగీరథ ఓవర్ హెడ్ స్టోరేజ్‌రిజర్వాయర్ నిర్మాణం, రూ.7 కోట్లతో 6 కిలోమీటర్ల రహదారి డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు, రూ.20 లక్షలతో 7 కిలోమీటర్ల పరిధిలో 30 వేల మొక్కల అవెన్యూ ప్లాంటేషన్ పనులు ప్రారంభించబడ్డాయి.అలాగే రూ.25 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం,రూ.5 కోట్లు 50లక్షలతో కొండారెడ్డిపల్లి- రాంనగర్ బిటి రహదారి, రూ.50 లక్షలతో డ్వాక్రా భవనం, రూ.35 లక్షలతో గ్రంథాలయం భవనం ఫస్ట్ ఫ్లోర్‌లో కల్చరల్ సెంటర్ పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోనే తొలిసారిగా రూ.10 కోట్లు 31 లక్షలతో వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్ కోసం మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేశారు. రూ.50 లక్షలతో కమ్యూనిటీ సెంటర్ నిర్మాణం,55 కోట్ల రూపాయలతో కొండారెడ్డి పల్లి గేట్ నుండి పోల్కంపల్లి గ్రామం వరకు రహదారి మెరుగుదల పనులు (భూసేకరణతో సహా), కొండారెడ్డిపల్లి ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి పోల్కంపల్లి వరకు మిషన్ భగీరథ గ్రిడ్ పైప్‌లైన్ పనులు ప్రారంభించబడ్డాయి. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం, గ్రామస్థాయి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అభివృద్ధి పనులు స్థానిక గ్రామ ప్రజల్లో ఆనందోత్సాహం కలిగించాయి.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మిస్తాం : మంత్రి వాకిటి శ్రీహరి



ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులతో మంత్రి, ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం వంగూరు మండల పరిధిలోని మిట్ట సదగోడు గ్రామంలో అంజలి భర్తరమేష్, ఎంగోపాల్ తండ్రి లక్ష్మయ్యలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లను నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డిలతో కలిసి రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇండ్లు లేక పేదలు ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.5 లక్షలతో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించడంఆనందంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నూతన గృహ ప్రవేశం చేసిన లబ్దిదారులకు ఈ ప్రాంతం వాసి నల్లమల్ల ముద్దుబిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చినమాట ప్రకారంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. డాక్టర్ వంశీకృష్ణ ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొనసాగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామనిఈ ప్రాంత నల్లమల్ల ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో అచ్చంపేట నియోజకవర్గం పూర్తిస్థాయిలో మరింతగా అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవియన్‌రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ రాజేందర్, వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆప్త మిత్రునికి ఆత్మీయ సన్మానం

**దామరగిద్ద, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల పరిధిలోనిఉడుముల్ గిద్ద గ్రామానికి చెందిన 1990, 91 ఎస్ఎస్సి బ్యాచ్‌కు చెందినరఘుపాల్ రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎన్నికైన సందర్భంగా రఘుపాల్‌కు మిత్రమండలి తరఫున ఉడుమల్‌గిద్దలో ఘనంగాసన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా మిత్రుడు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికవ్వడం చాలా సంతోషకరంగా ఉంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్యాంగ్ హనుమంతు, రవీందర్,రఘువీర్, నీది మాణిక్యప్ప, నరేష్, హుసేనప్ప, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

**బిజినపల్లి, సెప్టెంబరు28 ప్రభాతవార్త:** దసరా ఉత్సవాలను పురస్కరించుకొని పాలెం వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆహుతలను అలరించింది. శ్రీ పద్మావతి మాతృమండలి, ఫ్రెండ్స్ యూత్‌సభ్యుల ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రణవితేజ ఆధ్వర్యంలో చిన్నారులు ధాత్రేయ, శ్రావిక, రూపిక, క్రితిక, బ్రితిక, వర్ష చిన్నారులచే శ్రీ శారాదాంబ నమోస్తుతే, శ్రీసరస్వతి, శ్రీనవ్వదుర్గల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా చిన్నారులను శాలువాలు, మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ఆనంద్, ఆనంద్ సింగ్, వెంకటేష్, బిళ్ళకంటి వినయ్, పోతుల శ్రీనివాస్, వినయ్, సన్నీ, శషిధర్, నీలాధర్, మురళి, నర్సింహా, అల్లోజీ తదితరులు పాల్గొన్నారు.

## కూచూరులో దోమల నివారణకు ఫాగింగ్

**నవాబుపేట, సెప్టెంబరు28 ప్రభాతవార్త:** దోమల నివారణా చర్యల్లో భాగంగా మండల పరిధిలోని కూచూరు గ్రామ పంచాయతీ, కార్మికులు ఆదివారం గ్రామంలో దోమల నివారణకు పొగ మందును ఫాగింగ్ చేయటం జరిగింది. గ్రామస్తులు వర్షాకాలం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు.

## భగత్‌సింగ్‌కు ఘన నివాళి

**ఊట్కూర్, సెప్టెంబరు28 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలో షహీద్ భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు వాకిటి శివకుమార్ భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన యువ వీరులు. వారి జీవితమే నేటి యువతకు స్ఫూర్తి, ఆదర్శం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్ గౌడ్, ఎన్.తిరుపతి, కుక్కలి వెంకటప్ప, సి.అశోక్ కుమార్, గోవింద్ రాజ్, ఎన్.రాఘవేంద్ర, తులసిదాస్, చీర్ల చంద్రప్ప,సి.రమేష్,సప్పటి ఆంజనేయులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెంపుడు కుక్కలకు టీకాలు వేసిన పశువైద్యులు

**భూత్పూర్,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త :** రాబీస్ వ్యాధి సోకకుండా పెంపుడు కుక్కలకు ఆదివారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని పశువైద్య శాలలో పశువైద్యులు రాబీస్ టీకాలు వేశారు.ఈ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ వి వెంకటేశ్వర్లు,మండల పశువైద్యాధికారి డీఏవీఏహెచ్ఓ డాక్టర్ బి మధుసూధన్‌గౌడ్‌లుప్రారంభించారు.ఈ కార్యక్రమంలో యజమానులు తెచ్చిన దాదాపు 15 పెంపుడు కుక్కలకు రాబీస్ ఇంజెక్షన్లు వేశారు.ఈ కార్యక్రమంలో పెట్స్ స్టాఫ్ షైక్‌జాన్, లతీఫ్, శోభారాణి,బి వెంకటేష్ పాల్గొన్నారు.

## జె.కె ట్రస్టు ఆధ్వర్యంలో టీ షర్ట్స్ అందజేత

**నవాబుపేట, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** దసరా పండుగ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించే ఎన్‌పిఎల్ నవాబుపేట ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలకు జెకె ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరు టీములకు గాను 130 స్పోర్ట్స్ టీ షర్టులను టికెట్ టీం సభ్యులకు వితరణ చేశారు. జెకె ట్రస్టు క్రికెట్ టీం సభ్యులకు క్రికెట్ టీం సభ్యులకు, మండల ప్రజలకు పండగ సందర్భంగా పండగ శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సందర్భంగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. యువకులు క్రీడలతో పాటు శరీర దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం వస్తుందని ఇలాంటి కార్యక్రమాల్లో జెకె ట్రస్టు తన వంతు సహాయం అందిస్తుందని ఈ సందర్భంగా జెకె ట్రస్ట్ వ్యవస్థాపకులు నరసింహ చారి జేకే ట్రస్ట్ మెంబర్స్,కార్యకర్తలు తెలిపారు.

## చర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**చిన్నచింత కుంట, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** మండలంలోని చిన్న వడ్డేమాన్ గ్రామంలో ఆదివారం ఎంబి మిస్పా సంఘము నూతన చర్చి ప్రారంభోత్సవంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మనుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగాహాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్టియన్ల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు. అనంతరం చర్చి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ముడా నిధులనుంచి రూ. 5 లక్షల ప్రోసిడింగ్‌ను క్రిస్టియన్ మత పెద్దలకు అందజేశారు. అంతకు ముందు గ్రామంలో నాలుగులక్షల ముడా నిధులనుంచి మంజూరైన రెండు ఐమాక్స్‌లైట్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మార్కెట్ చైర్మన్ కథలప్ప, మండల అధ్యక్షులు వై.నరేందర్ రెడ్డి, నాయకులు వట్టెం శివకుమార్, అంబరీష్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

**అలంపూర్ సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ నేడు అమ్మవారికి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించడానికి రావడం జరుగుతుందని ఆలయ ఈవో దీప్తి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక శక్తిపీఠంగా విరాజిల్లుతున్న జోగులాంబ అమ్మవారు ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగా దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ నేడు అలంపూర్ ఆలయాలకు అమ్మవారికి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించడానికి రావడం జరుగుతుందని తెలిపారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం

**ఊట్కూర్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** ఊట్కూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ముల పిల్లలు ఎన్. రమాదేవి, ఎన్. మహేష్ కుమార్ ఇద్దరూ ఎంబీబీఎస్ సీటు సాధించడంతో గ్రామంలో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామానికి గర్వకారణమైన ఈ విజయంపై సివి అశోక్ తన కుటుంబ సభ్యులతో కలిసి రమాదేవి, మహేష్ కుమార్‌లను శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులను అభినందిస్తూ భవిష్యత్తులో ఇంకా ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

## కాత్యాయని దేవికి జలాభిషేకం

**దేవరకద్ర, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల భాగంగా ఆదివారం ఏడవ రోజు శ్రీ కాత్యాయని దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. అర్చకులు తరిమల హరిశంకర్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, పవిత్ర జలాలతో ఆర్యవైశ్య మహిళలు ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి అభిషేకించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.